సాక్షి కామారెడ్డి

మంగళవారం । 9 । జనవరి । 2024



దరఖాస్తులను పరిష్కరించాలి

ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు.

- 8లో ▸



పథకాలను వినియోగించుకోవాలి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.7 /14.2

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలితీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

బీజేపీ జహీరాబాద్ ఇన్‌చార్జీగా ఎమ్మెల్యే కేవీఆర్



కామారెడ్డి టౌన్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జీలను ప్రకటించింది. జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి బాధ్యతలను కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డికి అప్పగించింది. అలాగే నిజామాబాద్ ఇన్‌చార్జిగా నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని నియమించింది. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాకు కరీంనగర్ బాధ్యతలు, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డికి మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కళకళలాడుతున్న శనగ పంట



మద్నూర్: రబీ సీజన్‌లో సాగు చేసిన శనగ పంట కళకళలాడుతోంది. భారీగా పూత, కాత రావడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. యాసంగిలో మండలంలోని రైతులు ప్రధాన పంటగా శనగ వేస్తారు. మండలంలో 30 వేల ఎకరాల్లో శనగ పంట సాగవుతోంది. గతేడాది వాతావరణం అనుకూలించకపోవడంతో సరైన దిగుబడులు రాలేదు. దీంతో రైతులు నష్టపోయారు. ఈసారి వాతావరణం అనుకూలించడంతో పంట బాగుంది. ఈసారి ఎకరాకు పది క్వింటాళ్ల వరక దిగుబడి వస్తుందని ఆశిస్తున్నామని రైతులు చెబుతున్నారు.


కాడెద్దులకు బదులుగా..



నిజాంసాగర్: ఒకప్పుడు వ్యవసాయం అంటే నాగలి, కాడెద్దులు, ఎన్నో ప్రయాసలతో కూడిన ప్రక్రియ. ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రావడంతో ఆ ప్రయాస తగ్గింది. కాడెద్దులకు బదులుగా ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ఉల్లిసాగులోనూ ఆధునిక యంత్రాలను వాడుతున్నారు. జుక్కల్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన అశోక్ రెడ్డి ఉల్లి సాగు కోసం మహారాష్ట్ర నుంచి యంత్రాన్ని తీసుకువచ్చారు. కాడెద్దులకు బదులుగా ఇద్దరు కూలీలు యంత్రాన్ని లాగుతుండగా.. మరో వ్యక్తి విత్తనాలు వేస్తూ ముందుకు సాగారు. ఈ ఫొటోను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

పార్లమెంట్‌పై ఫోకస్

- దూకుడు పెంచిన ప్రధాన పార్టీలు
- గెలుపే లక్ష్యంగా పావులు
- నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించిన బీఆర్‌ఎస్
- ఇన్‌చార్జీలను నియమించిన కాంగ్రెస్, బీజేపీ



అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో ప్రధాన పార్టీలు పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారించాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన జోష్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఎంపీ ఎన్నికలలోనూ జోరు కొనసాగించాలని యోచిస్తోంది. అధికారాన్ని కోల్పోయి ప్రధాన ప్రతిపక్షంగా మారిన బీఆర్‌ఎస్.. పార్లమెంట్ ఎన్నికల్లోనైనా సత్తా చాటాలన్న ఆరాటంతో ఉంది. ఇక అసెంబ్లీ ఎన్నికలలో గణనీయంగా పుంజుకున్న బీజేపీ.. మోదీ హవాతో జహీరాబాద్‌లో కాషాయ జెండా ఎగరేయాలన్న లక్ష్యంతో సాగుతోంది.

సాక్షి, కామారెడ్డి: పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రధాన పార్టీలు దూకుడు పెంచాయి. ఇప్పటికే బీఆర్‌ఎస్ పార్టీ జహీరాబాద్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించగా.. కాంగ్రెస్, బీజేపీలు సైతం ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా ఆ పార్టీలు నియోజకవర్గ ఇన్‌చార్జీలను నియమించాయి. త్రిముఖ పోరు ఉంటుందని భావిస్తుండడంతో ఆయా పార్టీలు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

2019లో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్‌ఎస్ అభ్యర్థికి 41.58 శాతం ఓట్లు రాగా.. ద్వితీయ స్థానంలో నిలిచిన కాంగ్రెస్‌కు 40.98 శాతం ఓట్లు పోలయ్యాయి. ఆ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థికి 13.30 శాతం ఓట్లొచ్చాయి. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలలో పరిస్థితి మారిపోయింది. గతంలో నామమాత్రపు పోటీ ఇచ్చిన బీజేపీ.. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలలో ఓటు బ్యాంకును పెంచుకుంది. కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థి విజయం సాధించగా.. జుక్కల్, ఎల్లారెడ్డి, నారాయణ్‌ఖేడ్, అందోల్‌లలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. బీఆర్‌ఎస్ బాన్సువాడ, జహీరాబాద్ స్థానాలలో గెలుపుతో సరిపెట్టుకుంది. నియోజకవర్గం పరిధిలో మూడు ప్రధాన పార్టీలకు ఎమ్మెల్యేలు ఉండడంతో ఈసారి ఎంపీ ఎన్నికలలో త్రిముఖ పోరు తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పక్కా ప్రణాళికతో కాంగ్రెస్..

తెలంగాణలో పక్కా ప్రణాళికతో పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలవాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో విజయమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా నియోజకవర్గాలవారీగా ఇన్‌చార్జీలను నియమించింది. జహీరాబాద్ ఇన్‌చార్జీ బాధ్యతలను మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి అప్పగించింది. ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపే వీలైనన్ని గ్యారంటీ పథకాలను అమలు చేసి, ఓటర్లను తమ వైపు తిప్పుకోవడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన బీఆర్‌ఎస్.. పార్లమెంట్ ఎన్నికలలో గెలిచి పరువు నిలుపుకోవాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా సన్నాహక సమావేశాలను నిర్వహిస్తోంది. ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జహీరాబాద్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలు ఇందులో పాల్గొన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇందులో పాల్గొని అసెంబ్లీ ఎన్నికలలో ఓటమిపై సమీక్షించారు. వచ్చే ఎన్నికలకు సన్నద్ధమవడంపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

మోదీ హవాపై బీజేపీ ఆశలు..

శాసనసభ ఎన్నికలలో గణనీయమైన ఓట్లను సాధించిన బీజేపీ.. జహీరాబాద్ స్థానంపై ఆశలు పెట్టుకుంది. రాష్ట్రంలో పది ఎంపీ స్థానాలు గెలువాలన్న లక్ష్యంతో సాగుతున్న కమలదళం.. వ్యూహాలకు పదునుపెడుతోంది. ఎంపీ స్థానం పరిధిలో కామారెడ్డిలో విజయం సాధించిన బీజేపీ.. కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాలలోనూ గణనీయ స్థాయిలో ఓట్లను పొందింది. దీనికి తోడు అయోధ్యలో రామాలయ నిర్మాణం కల సాకారమవుతుండడం, మోదీ హవా కొనసాగుతుండడంతో ఎంపీ ఎన్నికలలో ఓటు బ్యాంకు పెరుగుతుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకే దెబ్బతో ఇద్దరు ఉద్దండులను మట్టి కరిపించిన వెంకటరమణారెడ్డిని జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి ఇన్‌చార్జిగా నియమించి బీజేపీ ప్రత్యర్థులకు సవాల్ విసిరింది.

లక్ష్యానికి దూరంగా పంటల సాగు



పత్తి పంటను ట్రాక్టర్‌తో దున్నేస్తున్న దృశ్యం



చలి ప్రభావంతో ఎదగని వరి నారు

- అనుకూలించని వాతావరణం
- ఎదగని వరి నారు, ముందుకు సాగని నాట్లు
- దెబ్బతిన్న ఇతర పంటలు

నిజాంసాగర్: వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో యాసంగి పంటల సాగు నెమ్మదించింది. ఓవైపు చలి ప్రభావంతో వరి నారుమళ్లు ఎదగలేదు.. మరోవైపు వర్షాల జాడ లేకపోవడంతో ఆరుతడి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు నష్టపోతున్నారు.

3.75 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం

రైతులు కోటి ఆశలతో యాసంగి పంటల సాగుకు సమాయత్తమయ్యారు. ఖరీఫ్‌లో ఆశాజనకంగా వర్షాలు కురియడంతో సాగునీరు అందుబాటులో ఉంది. దీంతో యాసంగిలో 3.75 లక్షల ఎకరాలలో పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. అయితే వాతావరణం అనుకూలించకపోవడంతో అంచనాలు తలకిందులయ్యాయి. జిల్లాలో ఇప్పటివరకు 1.51 లక్షల ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. చలి ప్రభావంతో నారు ఎదగలేదు. రైతులు ప్రస్తుతం మరోసారి నారు పోస్తున్నారు. మరోవైపు వర్షాలు లేకపోవడంతో ఆరుతడి పంటలు దెబ్బతిన్నాయి. ఈనెలాఖరు వరకు నాట్లు పడే అవకాశాలున్నాయి.

పత్తి రైతు చిత్తు

వానాకాలం సీజన్‌లో పత్తి సాగు చేసిన రైతులు చిత్తయ్యారు. పంట సాగు సమయంలో వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పంట మొలకెత్తలేదు. దీంతో రెండోసారి విత్తనాలు వేశారు. వర్షాలు తగ్గినా అప్పట్లో వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పంటలు ఆశాజనకంగా ఎదగలేదు. ఒకటి రెండు సార్లు మాత్రమే కాత వచ్చింది. పంట ఎండిపోతుండడంతో రైతులు మొక్కలను తొలగిస్తున్నారు. పత్తి పంట సాగుకోసం పెట్టిన పెట్టుబడులు సైతం రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి కూడా రాలేదు



మూడెకరాలను కౌలుకు తీసుకుని పత్తి వేసిన. మొదటి సారి విత్తనాలు వేసినప్పుడు సరైన వర్షాలు లేక మొలకెత్తలేదు. దీంతో మళ్లీ విత్తనాలు వేయాల్సి వచ్చింది. ఈసారి అధిక వర్షాలతో కొంత పంట దెబ్బతింది. చివరికి మూడెకరాలలో కలిపి 14.8 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. సాగు ఖర్చులకు అయిన డబ్బులు కూడా తిరిగి రాలేదు. – చాకలి బాలరాజు, కౌలు రైతు, పెద్దకొడప్‌గల్

లాభం లేదు



ఎకరంనర భూమిలో పత్తి పంట సాగు చేశా. పంట సాగు సమయంలో కురిసిన వర్షాల తో నష్ట జరిగింది. కాత, పూత దశలలో వానలు లేకపోవడంతో దిగుబడి తగ్గిపోయింది. ఆరు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. యాసంగిలో శనగ, జొన్న పంట సాగు చేసిన.. వర్షాల్లేక పంట ఎండిపోయింది. ఏ పంట వేసినా నష్టమే వస్తోంది. – ఎడ్ల భూమిరెడ్డి, రైతు, పెద్దకొడప్‌గల్

సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు

- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశం
- పలు అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

కామారెడ్డి క్రైం: కస్టం మిల్లింగ్ రైస్ డెలివరీ లక్ష్యాలను పూర్తి చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఆయన సోమవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ, కస్టం మిల్లింగ్ రైస్‌లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మిల్లర్లకు కేటాయించిన సీఎంఆర్‌ను రోజువారీ లక్ష్యాల ప్రకారం పూర్తి చేసేలా చూడాలన్నారు. లక్ష్యాలను పూర్తి చేసేవరకు సంబంధిత మిల్లులను తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ వేగవంతంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి సూచించారు.

జాప్యం లేకుండా చూడండి

ఎలాంటి జాప్యం లేకుండా సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ పాటిల్ సీఎంఆర్‌పై సమీక్ష నిర్వహించారు. మిల్లులను రోజూ తనిఖీలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో మల్లికార్జున బాబు, సివిల్ సప్లయీస్ డీఎం అభిషేక్ సింగ్, డీఎల్‌పీవో సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో ట్రాన్స్‌కో ఏఈ

- అద్దె వాహనం బిల్లులకు రూ.12,500 లంచం డిమాండ్
- కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు



నిందితుడు ఏఈ రాజు



వివరాలు తెలుపుతున్న ఏసీబీ డీఎస్పీ



విచారణ జరుపుతున్న ఏసీబీ అధికారులు

కామారెడ్డి క్రైం: అద్దె వాహనానికి సంబంధించిన బిల్లుల చెల్లింపుల విషయంలో డబ్బులు డిమాండ్ చేసిన ఓ ట్రాన్స్‌కో ఏఈని ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీబీపేటకు చెందిన సయానీ రాజు కామారెడ్డిలో నివాసం ఉంటూ ట్రాన్స్‌కో(132 కేవీ లైన్స్)లో ఏఈగా పనిచేస్తున్నాడు. జిల్లా కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఆవరణలో ట్రాన్స్‌కో కార్యాలయం ఉంది. భారీ టవర్ల మీదు గా ఉండే పెద్ద లైన్స్‌ను పర్యవేక్షిస్తుంటారు. ఇందులో భాగంగా అద్దెకు వాహనాలను తీసుకుని పర్యటిస్తుంటారు. సదాశివనగర్ మండలం ఉత్తునూరు గ్రామానికి చెందిన కుంట భైరవ చాలా రో జులుగా ట్రాన్స్‌కోలో రెండు గూడ్స్ వాహనాలను అద్దెకు నడుపుతున్నాడు. ట్రాన్స్‌కో ఒక్కో వా హనానికి ప్రతినెలా రూ.61 వేలు అద్దె చెల్లిస్తోంది. ఇదిలా ఉండగా భైరవకు చెందిన రెండు వాహనాలకు సంబంధించిన మూడు బిల్లులు(మొత్తం రూ.1.83 లక్షలు) పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్కో బిల్లుకు నెలకు రూ. 3 వేల చొప్పున, గైర్హాజరైన రో జుకు సంబంధించి రూ.500 కలిపి మొత్తం రూ.12,500 ఇస్తేనే బిల్లులు మంజూరు చేస్తానని ఏఈ రాజు డిమాండ్ చేశాడు. దీంతో భైరవ గత నెల 30న ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో విచారణ జరిపిన పోలీసులు నిందితుడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు వల పన్నారు. ఇందులో భాగంగా సోమ వారం ఏసీబీ అధికారులు ఇచ్చిన డబ్బులను తీసు కుని భైరవ కామారెడ్డి బస్టాండ్ ప్రాంతానికి వచ్చా డు. ఏఈకి ఫోన్ చేసి డబ్బులు తెచ్చానని చెప్పాడు. తాను అందుబాటులో లేనని చెప్పిన ఏఈ.. బస్టాండ్ ప్రాంతంలోని ఓ జిరాక్స్ సెంటర్‌లో డబ్బులు ఇవ్వాలని సూచించాడు. జిరాక్స్ సెంటర్ యజమాని సంతోష్ డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. డబ్బులు తీసుకునేందుకు సంతోష్ వద్దకు వస్తున్న దారిలో ఏఈ రాజును కూడా అదుపులోకి తీసుకుని ఏసీబీ కార్యాలయానికి తరలించారు. అక్కడ దాదాపు మూడు గంటల పాటు విచారించారు. నిందితుడిని కరీంనగర్ ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1064 లో సంప్రదించాలని సూచించారు.

ఐక్యత లేకే ఓటమి

- మాజీ ఎమ్మెల్యేలు ఇకనైనా మారాలి
- లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత
- మాజీ ఎమ్మెల్యేలకు చురకలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

నిజామాబాద్ నాగారం : మాజీ ఎమ్మెల్యేల పనితీరు సక్రమంగా లేకపోవడం..కార్యకర్తలను దూరంపెట్టడం వల్లే పార్టీ అధికారంలోని రాలేదని, ఇకనైనా ఐక్యంగా ఉండి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో జరుగుతున్న బీఆర్‌ఎస్ పార్టీ నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలో విబేధాలను పక్కన పెట్టాలన్నారు. అందరినీ కలుపుకొని పోవాలన్నారు. కార్యకర్తలను కాపాడుకుంటూ పార్టీ ఆదేశాలను పాటించాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్‌ఎస్ జనరల్ సెక్రెటరీ కే కేశవరావు, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ కేఆర్ సురేష్ రెడ్డి, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తదితరులున్నారు.

కూతకూతకూ ఉత్కంఠ

- హుషారుగా సాగుతున్న జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీ
- రెండోరోజు 16 మ్యాచ్‌లు
- డ్రాగా ముగిసిన తెలంగాణ–ఉత్తరాఖండ్ మ్యాచ్



తెలంగాణ జట్టు క్రీడాకారులను తప్పించుకుని వెళ్తున్న ఉత్తరాఖండ్ రైడర్



కేరళ రైడర్‌ను పట్టుకునే ప్రయత్నం చేస్తున్న యూపీ జట్టు సభ్యులు



తలపడుతున్న తెలంగాణ- ఉత్తరాఖండ్ జట్లు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అండర్ -17 కబడ్డీ టోర్నీ కొనసాగుతోంది. సోమవారం రెండోరోజు 16 మ్యాచ్‌లు నిర్వహించారు. పోటీలు ఉత్కంఠగా సాగాయి. తెలంగాణ- ఉత్తరాఖండ్‌ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. పోటీలను తిలకించేందుకు అభిమానులు తరలివచ్చారు.

ఉదయం 8 మ్యాచ్‌లు..

ఉదయం సెషన్‌లో ఎనిమిది మ్యాచ్‌లు నిర్వహించారు. తెలంగాణ– ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ తీవ్ర ఉత్కంఠగా సాగింది. మొదట తక్కువ స్కోరులో ఉన్న తెలంగాణ టీం నెమ్మదిగా పుంజుకుని విజయానికి చేరువైంది. చివరి కూతలో జార్ఖండ్ రైడర్‌కు రెండు పాయింట్ల సమర్పించుకోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో రెండు జట్లు 39 పాయింట్లు సాధించాయి. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో ప్రేక్షకులు ఈలలు, కేకలతో ఇరుజట్ల ఆటగాళ్లను ప్రోత్సహించారు. జార్ఖండ్ క్రీడాకారులు పలుమార్లు మ్యాచ్ మధ్యలో అతిగా ప్రవర్తించారు. ఈ క్రమంలో మ్యాట్‌పైనే క్రీడాకారులు నిరసన తెలపడంతో రిఫరీలు వార్నింగ్ కార్డులు చూపడంతో వెనక్కితగ్గారు.

ఉత్తరప్రదేశ్ జట్టు కేరళ జట్టుపై 50–38 పాయింట్లతో గెలిచింది. కర్ణాటక జట్టు 37–29తో హిమాచల్ ప్రదేశ్‌పై, ఢిల్లీ జట్టు 44–30 తేడాతో ఎన్‌వీఎస్ జట్టుపై, హర్యానా జట్టు 52–40 తో గుజరాత్‌పై, రాజస్థాన్ జట్టు 36–33తో చత్తీస్‌ఘడ్‌పై, బీహార్ జట్టు 54–26తో పంజాబ్ జట్టుపై, కేవీఎస్ జట్టు 51–40తో ఒడిషాపై గెలుపొందాయి.

మధ్యాహ్నం 8 మ్యాచ్‌లు...

మహారాష్ట్ర జట్టు 84–21 పాయింట్ల భారీ తేడాతో జార్ఖండ్‌పై విజయం సాధించింది. జమ్మూకశ్మీర్ 66–63 తో సీబీఎస్‌బీఎస్‌వోపై విద్యాభారతి జట్టు 58–26 పాయింట్లతో వెస్ట్ బెంగాల్‌పై, తమిళనాడు జట్టు 45–21తో పాండిచ్చేరిపై, గుజరాత్ జట్టు 41–23 పాయింట్లతో ఆంధ్రప్రదేశ్‌పై, చత్తీస్‌ఘడ్ 49–46 పాయింట్లతో మధ్యప్రదేశ్ జట్టుపై, పంజాబ్ జట్టు 45–35 తో సీఐఎస్‌సీఈపై, కేవీఎస్ జట్టు 59–38 పాయింట్లతో చండీగఢ్‌పై గెలిచాయి.



మ్యాట్‌పై కూర్చుని నిరసన తెలుపుతున్న ఉత్తరాఖండ్ జట్టు సభ్యులు

క్లుప్తంగా

ఆర్యసమాజ్ తాత ఇకలేరు



భిక్కనూరు: కామారెడ్డి ప్రాంతంలోనే ఆర్యసమాజ్ తాతగా పిలువబడే మండంలోని జంగంపల్లికి చెందిన బక్కి నర్సయ్య (103) సోమవారం వేకువ జామున మృతి చెందారు. ఆయన ఈ ప్రాంతంలో తొలిసారిగా జంగంపల్లిలో ఆర్యసమాజ్ కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే బ్రహ్మజ్ఞాన ఆశ్రమాన్ని స్థాపించాడు. అలాగే తాడ్వాయి శబరిమాత అమ్మవారికి తొలి శిష్యుడుగా శిష్యరికం పొందాడు. నర్స య్య కొన్ని రోజులుగా విజయవాడలో తన చిన్న కుమారుడి ఇంటి వద్ద ఉంటున్నాడు. సోమవారం అక్కడే ఆయన తుదిశ్వాసను వదిలాడు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల

నిజామాబాద్అర్బన్: మోడల్ స్కూళ్లలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు డీఈవో దుర్గాప్రసాద్ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 12వ తేదీ నుంచి వచ్చే నెల 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీన హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బాన్సువాడ : పట్టణంలోని మదీనా కాలనీలో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. పట్టణానికి చెందిన ఖాసీం అనే వ్యక్తి ఇంట్లో రాత్రి షాట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

ఎల్లారెడ్డి: పట్టణంలోని విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం ఆవరణలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను మంగళవారం నిర్వహించనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ సత్యనారాయణగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు వారి సమస్యలపై పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు వాటిని పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దరఖాస్తులను పరిష్కరించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 46 ఫిర్యాదులు వచ్చాయి. ప్రధానంగా రెవెన్యూ, జిల్లా పంచాయతీ, పోలీస్ శాఖకు సంబంధించి 39 దరఖాస్తులు రాగా, గిరిజన సంక్షేమం, ఉపాధి శాఖకు సంబంధించి రెండు వినతుల చొప్పున, భూమి కొలతలు, ఆబ్కారీ, మహిళా శిశు సంక్షేమానికి సంబంధించి ఒక్కో ఫిర్యాదు వచ్చాయి.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజాపాలన ద్వారా స్వీకరించిన దరఖాస్తుల వివరాలను నిర్ణీత కాలవ్యవధిలోగా కంప్యూటర్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సాయన్న, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లకు కరెంట్ లేదు



కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్‌పల్లి వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించిన అలాట్‌మెంట్ పత్రాలు ఇవ్వకపోవడంతో విద్యుత్‌శాఖ అధికారులు మీటర్లు పెట్టడం లేదని సోమవారం లబ్ధిదారులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. అలాట్‌మెంట్ పత్రాలు ఇప్పించి కరెంట్ సౌకర్యం కల్పించాలని కోరారు.

– డబుల్ ఇళ్ల లబ్ధిదారులు, రామేశ్వర్‌పల్లి

ఉన్న వారికే ఇళ్లిచ్చారు



దేవునిపల్లి శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో చాలా వరకు ఇళ్లు, ఆస్తులు కలిగిన వారికే కేటాయించారని స్థానికులు ఆరోపించారు. ఇళ్లు లేని నిరుపేదలు కొందరు ప్రజావాణికి వచ్చారు. డబుల్ ఇళ్ల కేటాయింపులో తమకు అన్యాయం జరిగిందన్నారు. తాము అద్దె ఇళ్లు, గుడిసెల్లో కాలం వెళ్లదీస్తున్నామని తెలిపారు. ఇప్పటికీ చాలా ఇళ్లు ఖాళీగా ఉన్నాయన్నారు. కొందరు వాటిని అద్దెలకు ఇచ్చుకుంటున్నారని ఆరోపించారు. విచారణ చేసి అసలైన నిరుపేదలమైన తమకు ఇళ్లు కేటాయించాలని కలెక్టర్‌కు మొర పెట్టుకున్నారు.

– దేవునిపల్లి వాసులు

న్యాయం చేయండి..



తమ ప్రమేయం లేకుండా తమ పేరు మీద రుణం తీసుకున్నట్లు నమోదు చేసి డబ్బులు డ్రా చేసుకున్న వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరుతూ సదాశివనగర్ మండలం లింగంపల్లికి చెందిన సాకలి బాల్‌రాజు, అంజవ్వలు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సదాశివనగర్‌లోని యూనియన్ బ్యాంకులో గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అంజవ్వ పేరు మీద రూ. 2.95 లక్షలు, బాల్‌రాజు పేరు మీద 1.99 లక్షలు అప్పుగా తీసుకున్నట్లు ఉందన్నారు. విచారణ జరిపించి న్యాయం చేయాలని ప్రజావాణిలో మొర పెట్టుకున్నారు.

– పంట రుణం బాధితులు, లింగంపల్లి, సదాశివనగర్ మండలం

డిచ్‌పల్లి ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం

డిచ్‌పల్లి : డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె శ్రీనివాస్ అలియాస్ భూమయ్యపై 12 మంది ఎంపీటీసీలు అవిశ్వాసం ప్రకటించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్‌కు సోమవారం తీర్మానం కోరుతూ లేఖను అందజేశారు. డిచ్‌పల్లి మండలంలో 17 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 2019లో జరి గిన ఎన్నికల్లో 11 మంది టీఆర్ఎస్ పార్టీ, ముగ్గురు కాంగ్రెస్ పార్టీ, ఒకరు బీజేపీ, ఇద్దరు స్వతంత్ర్య అభ్యర్థులు విజయం సాధించారు. అప్పటి రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రోద్బలంతో బీఆర్ఎస్‌కు చెందిన దూస్‌గాం ఎంపీటీసీ గద్దె భూమయ్య ఎంపీపీగా, నడిపల్లి -1 ఎంపీటీసీ కులాచారి శ్యాంరావు వైస్ ఎంపీపీగా ఎంపికయ్యారు. అనంతరం జరిగిన పరిణామాలతో ఎంపీపీ, వైస్ ఎంపీపీ, సుద్దపల్లి, మెంట్రాజ్‌పల్లి ఎంపీటీసీలు యెంబడి సంతోషం, దుంపాల సౌమ్య బీజేపీలో చేరారు. బీజేపీకి చెందిన ఘన్‌పూర్ ఎంపీటీసీ కుర్రి సవితతో పాటు ధర్మారం(బి)-1 ఎంపీటీసీ పులి నర్సింగ్‌రావు, డిచ్‌పల్లి ఎంపీటీసీ లొక్కిడి కొత్తూరు మానస బీఆర్ఎస్‌లో చేరారు. ఇటీవల కాంగ్రెస్ అధికారంలో రాగానే రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సమక్షంలో ఏడుగురు బీఆర్ఎస్ ఎంపీటీసీలు కాంగ్రెస్ చేరా రు. దీంతో కాంగ్రెస్ ఎంపీటీసీల సంఖ్య తొమ్మిదికి చేరింది. మిగిలిన వారిలో బీజేపీ ఎంపీటీసీలు నలుగురు, బీఆర్ఎస్ ఎంపీటీసీలు నలుగురు ఉన్నారు. అవిశ్వాసం కోసం 9 మంది మెజార్టీ సరిపోతుంది. ముల్లంగి(ఐ)కి చెందిన నడిపల్లి-2 ఎంపీటీసీ చిన్నోల్ల నర్సయ్యను ఎంపీపీగా చేయడానికి కాంగ్రెస్ ఎంపీటీసీలతో పాటు మిగిలిన నలుగురు బీఆర్ఎస్ ఎంపీటీసీలు మద్దతు తెలుపడానికి అంగీక రించినట్లు సమాచారం. ఎంపీటీసీల పదవీ కాలం జూలై 7వ తేదీ వరకు ఉంది. మంగళవారం ఆర్డీవో కార్యాలయం నుంచి డిచ్‌పల్లి ఎంపీడీవో కార్యాలయానికి ఎంపీటీసీ సభ్యుల సంతకాల నిర్ధారణ కోసం లేఖ పంపించనున్నారు.

ప్రమాదపుటంచున కూలీలు



ఎలాంటి రక్షణ లేకుండా బ్రిడ్జి పనులు చేస్తున్న కూలీలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): నేషనల్ హైవే అథారిటీ అధికారులు ఎలాంటి నియమనిబంధనలు పాటించకుండా సంబంధిత గుత్తేదారులతో ఇష్టారీతిన బ్రిడి నిర్మాణ పనులు చేయిస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు చేస్తున్న కూలీలకు కనీస భద్రత కల్పించడంలో విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనులు చేస్తున్న సమయంలో ప్రమాదాల బారిన పడితే బాధ్యులెవరని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కూలీలు ఎత్తుగా ఉన్న చోట ఇనుప రాడ్లను అమరుస్తున్నారు. ఒకవేళ కాలుజారి నేలపై పడితే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. తలకు సేఫ్టీ హెల్మెట్ ధరించకుండా పనులు చేస్తున్నారని విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ



దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

కామారెడ్డి రూరల్: ప్రజాపాలన గ్రామ సభల్లో లబ్ధిదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ కామారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్నది. ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. మండలంలో మొత్తం 6, 544 దరఖాస్తులను స్వీకరించారు. ఒక కుటుంబం ఒక దరఖాస్తు మాత్రమే చేయాలని ప్రభుత్వం నిర్దేశించినప్పటికీ.. ఒక్కో కుటుంబం నుంచి రెండు, మూడు దరఖాస్తులు అందాయి. రైతుబంధు, ఆసరా పింఛన్ లబ్ధిదారులు సైతం దరఖాస్తు చేయడంతో అంచనాకు మించి దరఖాస్తులు వచ్చాయి.

ఎంపీవో మల్హారి ఆధ్వర్యంలో గ్రామాల వారీగా దరఖాస్తుల వివరాలను కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఒక్కో దరఖాస్తుకు ప్రత్యేకంగా యూనిక్ కోడ్ నెంబర్‌ను కేటాయిస్తున్నారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన కానిస్టేబుల్ డీకొండ ముఖేశ్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ముఖేశ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

12నుంచి యువజన వారోత్సవాలు



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

కామారెడ్డి టౌన్: స్వామి వివేకానంద, సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా ఏబీవీపీ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు యువజన వారోత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ కృష్ణ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 12న స్వామి వివేకానంద, 23న సుభాష్‌చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని వారోత్సవాలు నిర్వహిస్తామని, సరస్వతీ శిశుమందిర్ మైదానంలో ఆటల పోటీలు ఉంటాయన్నారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఏబీవీపీ హాస్టల్ కన్వీనర్ ఖలీల్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ప్రత్యూష, నగర స్టూడెంట్ ఫర్ సేవా కన్వీనర్ సంజయ్, అఖిల తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పెంపు

నిజామాబాద్‌అర్బన్: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఓపెన్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు గడువును పెంచినట్లు డీఈవో సోమవారం పేర్కొ న్నారు. ఈనెల 11వ తేదీ వరకు ప్రవేశాలు పొందవచ్చన్నారు. టీఎస్ ఆన్‌లైన్, మీ సేవ సెంటర్లలో ప్రవేశ రుసుం చెల్లించవచ్చన్నారు.

వీరజవాన్ల కుటుంబ సభ్యులకు చెక్కుల పంపిణీ



నిజామాబాద్‌నాగారం: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఆర్మీలో విధులు నిర్వహిస్తూ సర్వీసులో మరణించిన ముగ్గురు సైనికుల కుటుంబ సభ్యులకు సోమవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ, రిటైర్డ్ కల్నల్ రమేశ్‌కుమార్ చెక్కులను పంపిణీ చేశారు. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్‌డే ఫండ్ నుంచి మంజూరు చేసిన ఆర్థిక సహాయ చెక్కులను చెవుల ప్రశాంత్ భార్య చెవుల సుకన్య, నీరడి గంగాప్రసాద్ భార్య నీరడి శిరీష, ఈగ జైపాల్ భార్య స్వరూపకు ఒక్కొకరికి రూ. మూడు లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి డి.రమేశ్, సిబ్బంది ఫహీముద్దీన్, బదాం గంగా మోహన్, లక్ష్మణ్, ఉమేర్ పాల్గొన్నారు.

ఏఎస్సైపై దాడిచేసిన వారిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి ఏఎస్సై నీలికృష్ణపై దాడిచేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మూడోటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంగ్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తుండగా పోలీసులు ఓ వాహనాన్ని ఆపారు. మద్యం మత్తులో ఉన్నవారు ఏఎస్సైపై దాడికి పాల్పడ్డారు. దీంతో నిందితులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

మట్కా స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి



ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మిర్చి కంపౌండ్ రైల్వే ట్రాక్ పక్కన మట్కా స్థావరంపై సోమవారం టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. దాడుల్లో మట్కా ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య తెలిపారు. వీరి నుంచి రూ. 9,860 స్వాధీనం చేసుకున్నారు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి



నర్సారెడ్డి మృతదేహం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని చందాపూర్‌కు చెందిన అల్లూరి నర్సారెడ్డి(39) అనే రైతు కరెంటు షాక్ తగిలి మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నర్సారెడ్డి అదే గ్రామానికి చెందిన అల్లూరి ప్రకాశ్‌రెడ్డికి సంబంధించిన వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంటను సాగుచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే మొక్కజొన్న పంటకు నీళ్లు పెట్టడానికి చేనులోకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నర్సారెడ్డి కాళ్లకు కరెంటు వైర్లు తగలగా షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మౌనిక, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

దశాబ్దాల నాటి చెట్టుకు నిప్పు



ఎడపల్లి(బోధన్): ఒకవైపు ప్రభుత్వం హరితహారం పేరిట ప్రతియేటా చెట్లను పెంచితే.. మరో వైపు దుండగులు చెట్లకు నిప్పు పెడుతున్నారు. ఎడపల్లి మండలం బోధన్ – అలీసాగర్ ప్రధాన రహదారి పక్కనే దశాబ్దాల నాటి కింది చెట్టుకు నిప్పుపెట్టారు. చెట్లను తగులబెట్టుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



నరేశ్(ఫైల్)

ఇందల్వాయి: ఇందల్వాయి మండలం వెంగల్‌పాడ్ పరిధిలోని పాటి తండాకు చెందిన లావుడ్య నరేశ్(21) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నరేశ్ గతనెల 30వ తేదీ నుంచి తండాలో కనిపించడంలేదు. దీంతో అతని తల్లి నీలాబాయి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేస్తుండగా తిర్మన్‌పల్లి శివారులో రైల్వే ట్రాక్ పక్కన నరేశ్ మృతదేహాన్ని గుర్తించారు. మృతికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. నరేశ్‌కు ఒక కూతురు ఉంది. పదిహేను రోజుల క్రితం మరో కూతురు జన్మించగా భార్య తల్లిగారి ఇంటివద్దే ఉంటుంది. మృతుడు తిర్మన్‌పల్లిలోని సామిల్లులో పని చేస్తున్నాడు. తాగుడికి బానిసై అప్పులు చేశాడని తెలిసింది. మృతుడి తల్లి ఫిర్యాదుమేరకు హత్య కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాగులో పడి యువతి..

లింగంపేట: మండలంలోని కొర్పోల్‌కు చెందిన కల్లు సుప్రజ(22) వాగులో పడి మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కల్లు లక్ష్మి, బాల్‌రాజు దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లు చేశారు. చిన్న కూతురు సుప్రజ పెళ్లయిన కొద్దిరోజులకే భార్యభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో విడాకులు తీసుకుని తల్లిదండ్రులతో ఉంటుంది. ఆదివారం తల్లిదండ్రులు బంధువుల ఇంట్లో ఫంక్షన్ ఉండగా వెళ్లారు. కూతురును పొలం వద్ద కాపలా ఉండాలని చెప్పడంతో వెళ్లింది. సాయంత్రం తల్లిదండ్రులు వచ్చేసరికి ఇంట్లో లేకపోవడంతో పొలం వద్దకు వెళ్లి వెతికారు. బంధువులు, చుట్టుపక్కల వారికి ఫోన్‌చేసినా ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం ఉదయం పొలం వద్ద పెద్దవాగులో కూతురు శవమై తేలింది. పంటకు నీళ్లుపెట్టే క్రమంలో మూర్ఛ వచ్చి వాగులో పడిన ట్లు గుర్తించారు. సుప్రజ మూర్ఛ వ్యాధితో బాధపడుతోంది. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బైక్‌ను ఢీకొన్న బోరుబండి

- ప్రమాదంలో యువకుడి మృతి



బాలరాజు (ఫైల్)

ఎల్లారెడ్డి: బైక్‌పై ఎదురుగా వస్తున్న యువకుడిని బోరు బండి ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని జంగమయ్యపల్లి శివారులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగమయ్యపల్లికి చెందిన అక్కం బాలరాజు(19) మత్తమాలలో తన తమ్ముడిని పాఠశాలలో దింపి జంగమయ్యపల్లికి వస్తుండగా ఎల్లారెడ్డి నుంచి రుద్రారం వైపు వెళ్తున్న బోరు బండి ఢీకొట్టడంతో బాలరాజు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోళ్ల పందాల స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

రుద్రూర్: కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతంగల్ శివారులో కోళ్ల పందాల స్థావరాలపై సోమవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. మంజీర నది శివారులో కోడిపందాలు ఆడుతుండగా నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలంలో మూడు పందెం కోళ్లు, రూ. 29 వేల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

రాంపూర్‌లో వివాహిత ఆత్మహత్య

- భర్తే చంపాడని మృతురాలి బంధువుల ఆందోళన

రుద్రూర్: కోటగిరి మండలం రాంపూర్‌లో సంపంగి మౌనిక(28) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నస్రురుల్లాబాద్ మండలం సంగెం గ్రామానికి చెందిన మౌనికకు, కోటగిరి మండలం రాంపూర్‌కు చెందిన మహేశ్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. దినసరి కూలీలుగా పని చేస్తారు. ఇటీవల కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం మౌనిక ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు చికిత్స నిమిత్తం తరలించే క్రమంలో మరణించింది. మౌనిక మృతి సమాచారం తెలుసుకున్న మృతురాలి బంధువులు రాంపూర్‌కు వచ్చి ఆందోళనకు దిగారు. మౌనికను భర్తనే చంపి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. దీంతో మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి ఆత్మహత్య

వర్ని: మండలంలోని కోటయ్య క్యాంపు గ్రామానికి చెందిన షేక్ నాజర్ వలి(36) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణ కుమార్ తెలిపారు. కుటుంబ కలహాల వల్ల భార్య పిల్లలు దూరంగా ఉండడంతో మనస్థాపానికి గురయ్యాడని, మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి తమ్ముడు షేక్ బాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మద్యానికి బానిసై యువకుడు..

బాన్సువాడ: మద్యానికి బానిసై బాన్సువాడ పట్టణానికి చెందిన మేతరి రితిక్(23) ఆత్మహత్య చేసుకున్నాడని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి అతిగా మద్యం సేవించి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. గతంలో కూడా రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. మృతుడి తల్లి లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య



పోశవ్వ(ఫైల్)

వర్ని: మండలంలోని పాత వర్నికి చెందిన శావులం పోశవ్వ(61) గ్రామ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం గ్రామ చెరువులో దూకగా సోమవారం చెరువులో మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కొంతకాలంగా పోశవ్వ అనారోగ్యానికి గురికాగా అదే బాధతో ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి కూతురు కవిత ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.